సాక్షి
వరంగల్

సోమవారం | 31 | మార్చి | 2025



రూటు మార్చి..ఘాటు పెంచి

యువత జీవితాలను నాశనం చేస్తున్న గంజాయి ఆకు, పువ్వు రూపంలోనే కాదు.. ఇప్పుడు లిక్విడ్ రూపంలోనూ లభిస్తోంది.

- 8లో▸



మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం

రాష్ట్రంలో మాదక ద్రవ్యాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $36^0/24^0$

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వేడి గాలులతో ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఆహ్లాదకరంగా మారుతుంది.

న్యూస్‌రీల్

నేడు రంజాన్

- ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గాలు



ఖిలా వరంగల్: ముస్లింల పవిత్ర రంజాన్ పండుగ(ఈద్–ఉల్–ఫితర్)ను సోమవారం(నేడు) జరుపుకోనున్నా రు. ఈనెల 2న ఉపవాస దీక్షలు ప్రారంభమ య్యాయి. ఆదివారం సాయంత్రం నెలవంక కనిపించడంతో ముగిశాయి. పండుగ రోజు సామూహిక ప్రార్థనలు చేయడానికి ఈద్గాల వద్ద పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.

కొమ్మాల జాతరకు పోటెత్తిన భక్తులు



గీసుకొండ: ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సతీసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు రామాచారి, ఫణి, విష్ణు.. ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



రాయపర్తి: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని సోషల్ వెల్ఫేర్ గురుకుల జిల్లా కోఆర్డినేటర్ అపర్ణ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో పీఎంశ్రీ పథకంలో భాగంగా విద్యార్థులకు బుర్ర కథ, సాంస్కృతిక కార్యక్రమాలు, మార్షల్ ఆర్ట్స్, మొబైల్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ సరిత తెలిపారు.

'భద్రకాళి'లో వసంత నవరాత్రులు ప్రారంభం



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో ఆదివారం వసంత నవరాత్ర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం అమ్మవారికి నిర్మాల్యసేవ, నిత్యాహ్నికం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వసంత నవరాత్ర ఉత్సవాలు నిర్వహించడానికి అనుజ్ఞాప్రార్థన, పూర్ణాభిషేకం చేసి పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. లక్ష గులాబీ పూలకు సంప్రోక్షణ చేసి అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కార్పొరేటర్ విజయలక్ష్మి సురేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య దర్శించుకున్నారు. సాయంత్రం అయినవోలు రాధాకృష్ణశర్మ సిద్ధాంతి పంచాంగ శ్రవణం చేశారు. దేవాలయ ఈఓ శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా పెద్దమ్మతల్లి జాతర



ఖిలా వరంగల్: విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా పెద్దమ్మతల్లి జాతర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. తూర్పుకోట ప్రాంతంలో చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయుల కాలం నాటి పెద్దమ్మతల్లి ఆలయంలో స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, పూజారి హంస పెద్దులు ఆధ్వర్యంలో దుర్గామాతకు ఉదయం శాస్త్రోక్తంగా అభిషేకాలు, అర్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాయదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దర్శించుకుని పూజలు చేశారు.



దుగ్గొండి: తొగర్రాయిలో వ్యవసాయ క్షేత్రంలో కొత్తసాలు చేస్తున్న రైతు కుటుంబం

కొత్త ఆశలతో

'విశ్వావసు'కు స్వాగతం

- ఘనంగా ఉగాది వేడుకలు
- పిండివంటల ఘుమఘుమలు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణం

తెలుగు నూతన సంవత్సరం.. ఉగాది వేడుకలను జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. కొత్త ఆశలతో 'విశ్వావసు' సంవత్సరానికి స్వాగతం పలికారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం పిల్లాపాపలు, ఆడబిడ్డలు, బంధువులతో తెలుగులోగిళ్లు సందడిగా మారాయి. కొత్తసాలుతో రైతులు నేలతల్లికి పూజలు చేసి వ్యవసాయ పనుల పునఃప్రారంభానికి శ్రీకారం చుట్టగా.. కులవృత్తులు చేసుకునేవారు తమ పనిముట్లకు పూజలు నిర్వహించి మరో ఏడాదికి సన్నద్ధమయ్యారు.

– సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట: చెన్నారావుపేటలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

స్లాట్ బుకింగ్‌తో రిజిస్ట్రేషన్ ఈజీ



- సబ్‌రిజిస్ట్రార్లకు తగ్గనున్న పనిభారం
- భూక్రయవిక్రయదారులు కోరుకున్న రోజే ప్రక్రియ
- రేపటి నుంచి పైలట్ ప్రాజెక్టుగా..



40 స్లాట్ బుకింగ్‌లకు మాత్రమే..

రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి తేనుంది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని వచ్చిన 40 స్లాట్‌లకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేస్తారు. 40కి పైగా వచ్చిన రిజిస్ట్రేషన్లను గుర్తించి సమీపంలో ఉన్న మరో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ సౌకర్యం కల్పిస్తారు, దీంతో సబ్ రిజిస్ట్రార్లకు పనిభారం తగ్గుతుంది. సబ్‌రిజిస్ట్రార్లు అందరూ ఒకే రకమైన విధులు నిర్వర్తించే అవకాశం ఉంది.

కాజీపేట అర్బన్: దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం భూక్రయవిక్రయదారులు ఇక గంటల కొద్ది వేచి ఉండనవసరం లేదు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే చాలు నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సులభతరం కానుంది. ప్రస్తుతం ప్రతిరోజూ ఒక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి 38 స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వ అవకాశం కల్పించింది. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 60 నుంచి 80, వంద కంటే ఎక్కువ కూడా దస్తావేజుల రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. దీంతో ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి స్లాట్‌తో వచ్చిన దస్తావేజులకు మాత్రమే రిజిస్ట్రేషన్ పూర్తిచేయాలని ప్రభుత్వం స్లాట్ బుకింగ్‌ను అమల్లోకి తేనుంది.

కోరుకున్న రోజే రిజిస్ట్రేషన్..

మంచి రోజు, కోరుకున్న రోజే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకునే వెసులుబాటును స్లాట్ బుకింగ్ కల్పిస్తుంది. ఒక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ పూర్తి అయిపోగానే అందుబాటులో ఉన్న మరో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి స్లాట్‌ను చేర్చుతుంది. దీంతో కోరుకున్న రోజే రిజిస్ట్రేషన్లను పూర్తి చేసుకునే అవకాశం ఉంది.

15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్..

సబ్‌రిజిస్ట్రార్లకు పనిభారం తగ్గించడంతో పాటు భూక్రయవిక్రయదారులు కోరుకున్న రోజున 15 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకునేందుకు స్లాట్ బుకింగ్ తోడ్పడుతుంది. తొలుత పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సూరారం, కూకట్‌పల్లి, అబ్దుల్లాపూర్‌మెట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏప్రిల్ 1 నుంచి ప్రారంభకానుంది. పైలట్ ప్రాజెక్టు లేని సందర్భంలో రెండు షిఫ్టులుగా సబ్ రిజిస్ట్రార్లు విధులు నిర్వర్తించే అవకాశం ఉంది.

– ఫణీందర్, జిల్లా రిజిస్ట్రార్, వరంగల్

తాతయ్య స్ఫూర్తి..

తల్లిదండ్రుల ప్రోత్సాహం

- డిప్యూటీ కలెక్టర్ కావాలనే లక్ష్యం
- విధులు నిర్వర్తిస్తూనే రోజుకు 8 నుంచి 9 గంటలు చదివా
- 'సాక్షి'తో గ్రూప్–1 నాలుగో ర్యాంకర్ తేజస్వినిరెడ్డి



కేయూ క్యాంపస్: తాతయ్య స్ఫూర్తి.. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో గ్రూప్–1 నాలుగో ర్యాంకు సాధించానని హనుమకొండ జిల్లా శాయంపేట మండలం తహరాపూర్(మాందారిపేట) గ్రామానికి చెందిన విజయపాల్‌రెడ్డి, హేమలత దంపతుల కుమార్తె తేజస్వినిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇంజనీరింగ్ పూర్తయ్యాక విదేశాలకు వెళ్లకుండా రాష్ట్రంలోనే ప్రభుత్వ సర్వీస్‌లో స్థిరపడాలనే బలమైన ఆకాంక్ష.. డిప్యూటీ కలెక్టర్ కావాలనే కోరిక ఉండేది. అందుకు దివంగత మా తాతయ్య రమణారెడ్డి స్ఫూర్తి. సైనికాధికారిగా పనిచేసిన ఆయన ప్రభుత్వ సర్వీస్‌లో చేరితే సమాజానికి సేవ చేసే అవకాశం ఉంటుందని ప్రోత్సహించారు. అందుకు తగినట్టుగానే కష్టపడి చదివాను. ప్రణాళికబద్ధంగా స్వతహాగా 18 సబ్జెక్టులకు సంబంధించి నోట్స్ తయారు చేసుకున్నాను. ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు. అమ్మాయిలు చిత్తశుద్ధితో కష్టపడితే అనుకున్న లక్ష్యం చేరుకోవచ్చు. సమాజంలో అమ్మాయిలు కూడా అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. విద్యతో ఏదైనా సాధించవచ్చు.

బీటెక్ పూర్తిచేశాక గ్రూప్స్ వైపు

హనుమకొండలోని సెయింట్‌పీటర్స్ హైస్కూల్‌లో టెన్త్ చదివాను. 559 మార్కులు వచ్చాయి. హైదరాబాద్ నారాయణ కాలేజీలో ఇంటర్ ఎంపీసీ చదివి 966 మార్కులు సాధించాను. కాకతీయ యూనివర్సిటీ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ కోర్సులో 85శాతం మార్కులు వచ్చాయి. ఆ తర్వాత గ్రూప్స్ వైపు దృష్టి సారించా.

మండల పంచాయతీ ఆఫీసర్‌గా..

బీటెక్ పూర్తయ్యాక 2019 సంవత్సరంలో గ్రూప్–2 రాయగా మండల పంచాయతీ ఆఫీసర్‌గా ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం భూపాలపల్లి మండల పంచాయతీ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను.



కుటుంబ సభ్యులతో తేజస్విని రెడ్డి

డిప్యూటీ కలెక్టర్ లక్ష్యంతో..

ఒక వైపు విధులు నిర్వర్తిస్తూనే డిప్యూటీ కలెక్టర్ కావాలనే లక్ష్యంతో గ్రూప్–1కు 2022 నుంచి ప్రిపేర్ అయ్యా. 'రోజుకు 8 నుంచి 9 గంటలు చదివాను. గత ఏడాది జూన్ 9న ప్రిలిమ్స్ రాసి మెయిన్స్‌కు ఎంపికయ్యాను. అక్టోబర్ 21 నుంచి 27 వరకు పరీక్షలు రాశాను'.. అని తేజస్వినిరెడ్డి వివరించారు.

లక్ష్య సాధకులు

- గ్రూప్–1లో మెరిసిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు

- వివరాలు 8లో▸

లక్ష్యం రూ.4.24 కోట్లు

- వసూలు రూ.3.52 కోట్లు
- ఒక్క రోజులో రూ.72 లక్షలు వసూలయ్యేనా?

నర్సంపేట: నర్సంపేట మున్సిపాలిటీలో హౌస్ టాక్స్ వసూళ్లపై అధికారులు ఎంత కసరత్తు చేసినా అనుకున్న లక్ష్యం చేరే అవకాశం లేదు. ఈ ఆర్థిక సంవత్సరం నేటితో ముగుస్తుండడంతో పట్టణంలోని 24 వార్డుల్లో.. వార్డు అధికారులు, సూపర్‌వైజర్, బిల్ కలెక్టర్‌తో సహా మరో నలుగురు సభ్యులు బృందంగా నాలుగు టీమ్‌లు ఆస్తి పన్ను వసూలుకు శ్రమిస్తున్నారు. ఆదివారం ఉగాది పర్వదినం అయినప్పటికీ బృందాలు వసూలు కోసం తిరిగినప్పటికీ మరో రూ8లను అభివృద్ధి పనులకు వెచ్చించాలని, ఉద్యోగులకు వేతనాలు, నిర్వహణ వంటి ఖర్చులకు స్థానిక సంస్థల ఆదాయం నుంచి ఖర్చు పెట్టాలని నిబంధనలు ఉంది. నర్సంపేట పట్టణంలో 16,458 అసైన్‌మెంట్‌లు ఉండగా రూ.4కోట్ల 24లక్షల ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉంది. అయితే సోమవారం రంజాన్ కావడంతో అనుకున్న లక్ష్యం పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. జనాభా ప్రాతిపదికన ప్రతీ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా నర్సంపేట మున్సిపాలిటీకి రూ.50లక్షలు విడుదల చేస్తుంది. ఈక్రమంలో లక్ష్యాన్ని చేరేందుకు బృందాలుగా పట్టణంలో తిరుగుతూ పన్ను వసూలు చేస్తున్నామని పురపాలిక ఇన్‌చార్జి మేనేజర్, ఆర్‌ఐ సంపత్‌కుమార్ తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది 12.95శాతం ఎక్కువగా వసూలు చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించి పన్నులు చెల్లించాలని కోరారు.



ఇంటి పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నేటి ప్రజావాణి రద్దు


వరంగల్: ప్రతి సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రంజాన్ పండుగను పురస్కరించుకుని నేడు (సోమవారం) రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సత్యశారద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఇక్కట్లు

> ఆరెపల్లికి చెందిన కొయ్యడ పావని దామెర గ్రామ పరిధిలో తనకున్న 200 గజాల స్థలానికి 2020 సెప్టెంబరు 29న ఎల్‌ఆర్‌ఎస్ కోసం రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఆవివరాలు వెబ్‌సైట్‌లో గల్లంతయ్యాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శులు తమ వద్ద వివరాలు లేవంటున్నారు. ఇలా నగరానికి చెందిన, శివారు ప్రాంతాల్లో స్థలాలు కొన్న యాజమానుల వివరాలు లభించకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరిని అడిగినా మేమేం చేయలేమంటున్నారు.

- దరఖాస్తులు గల్లంతు.. ఆన్‌లైన్ ఆగమాగం
- కలెక్టర్లు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి

వరంగల్ అర్బన్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం వరంగల్ ఉమ్మడి జిల్లాను 5 జిల్లాలుగా ఏర్పాటు చేశారు. అందులో వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాగా నిర్ణయించారు. తదుపరి 2022లో అనేక ఫిర్యాదులు, ఒత్తిళ్ల నేపథ్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాలుగా ఏర్పాటు చేశారు. దీంతో వరంగల్‌రూరల్ జిల్లాలోని ఆత్మకూరు, దామెర, నడికూడ, పరకాల మండలాలను హనుమకొండ జిల్లాలోకి చేర్చారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ.. 2020లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం తెలంగాణ అర్బన్ డెవలప్‌మెంట్, పంచాయతీ రాజ్ శాఖలకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం వెబ్‌సైట్‌లో వరంగల్ రూరల్, హనుమకొండ జిల్లాలు, మండలాలు అప్‌డేట్ చేయకుండానే వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. గతంలో వరంగల్ రూరల్ జిల్లాలో ఉన్న పలు మండలాలు హనుమకొండ జిల్లాలో కనిపిస్తున్నాయి. అటు హనుమకొండ, ఇటు వరంగల్ జిల్లాలోని ఆయా మండలాల్లో ఫిర్యాదుదారుల వివరాలు లేక ఆగమాగమవుతూ నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చొరవ తీసుకోవాలని, రెగ్యులరైజ్ చేసుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



గడువు పొడిగించేనా..

ఎల్‌ఆర్‌ఎస్ గడువు సోమవారం(నేడు)తో ముగియనుంది. రాష్ట్ర ప్రభుత్వం 2020లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. దీంతో నగర వ్యాప్తంగా 1.10 లక్షల దరఖాస్తులు నమోదయ్యాయి. ఈ పథకానికి సంబంధించి నాలుగు నెలలుగా ఫైళ్ల క్లియరెన్స్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు 25 శాతం మాత్రమే ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ప్రభుత్వానికి, స్థానిక సంస్థలకు ఆదాయం వచ్చే ఈ స్కీం పొడిగించే అవకాశాలు వందశాతం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఏ విషయం తేలాల్సి ఉంది.

పంచముఖి స్వామీ.. ప్రణామం

- కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధిగాంచిన కొనాయమాకుల హనుమంతుడు
- కొండగట్టు తర్వాత అంతటి ప్రాముఖ్యత
- ప్రారంభమైన స్వామివారి దీక్షలు



పంచముఖి ఆంజనేయస్వామి

గీసుకొండ: పంచముఖ ఆంజనేయస్వామిగా వెలసి.. భక్తుల కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధిగాంచి.. ఉమ్మడి వరంగల్‌తోపాటు సమీప జిల్లాల నుంచి భక్తుల మొక్కులు అందుకుంటున్న కొనాయమాకుల హనుమాన్ దీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని గీసుకొండ మండలంలో వరంగల్– నర్సంపేట ప్రధాన రహదారి పక్కన కొనాయమాకుల వద్ద వెలసిన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో సందడిగా మారింది. ప్రతీ మంగళ, శని వారాల్లో భక్తులు ఇక్కడికి అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేస్తుంటారు. పలువురు భక్తులు మండల, అర్ధమండల దీక్షలను స్వీకరించి నిష్ఠతో పూజలు చేస్తారు. జగిత్యాల జిల్లాలోని కొండగట్టు తర్వాత హనుమాన్ భక్తులు ఎక్కువగా దర్శించుకునే ఆలయాల్లో పంచముఖ ఆంజనేయస్వామి ఆయలం కూడా ఒకటని ప్రతీతి.



ప్రారంభమైన మాలధారణ

కమనీయం స్వామివారి రూపం

ఇక్కడి ఆలయంలో నల్లరాయితో మలచిన స్వామివారి విగ్రహం దైవత్వం ఉట్టిపడేలా ఉంటుంది. ఒకప్పుడు జింకలగడ్డగా పిలిచే ఈ ప్రాంతంలో సామిల్ యజమాని, హనుమాన్ భక్తుడు సీతాలక్ష్మణ్‌సా 1992లో స్వామివారి ఆలయాన్ని నిర్మించా రు. హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లోగల బుద్ధవిగ్రహాన్ని మలచిన ప్రముఖ శిల్పి గణపతి స్థపతి అంతకంటే ముందుగానే ఇక్కడి పంచముఖ హనుమాన్ విగ్రహాన్ని రూపుదిద్దారు. విగ్రహం తయారీ పూర్తయిన తర్వాత ఐదు సంవత్సరాలపాటు భూమిలో నిక్షిప్తం చేసిన అనంతరం వెలికితీసి ప్రతిష్ఠాపన చేయడం విశేషంగా చెబుతుంటారు. స్వామి వారి ఆలయ మండపం విశాలంగా ఉంటుంది. ఇందులోనే 2006లో తూర్పు వైపు శ్రీరామనామ క్షేత్రాన్ని నిర్మించారు. ఈక్షేత్రంలో సీతారాములు, లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు.



పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం

ఐదు ముఖాలు.. పది భుజాలు

ఆంజనేయస్వామి విగ్రహం ఐదు ముఖాలు, పది భుజాలు, పది ఆయుధాలను ధరించినట్లుగా రూ పొందించారు. తూర్పున వానర ముఖం, దక్షిణాన నారసింహ ముఖం, పశ్చిమాన గరుడ, ఉత్తరాన వరాహ, పై భాగంలో హయగ్రీవ ముఖంతో హనుమంతుడు దర్శనమిస్తాడు. ఎడమవైపు చేతుల్లో డాలు, పర్వతం, రామనామ పుస్తకం, సంజీవనీ పర్వతం, కపాలం, కుడి వైపు ఖడ్గం, సర్పం, నాగలి, గధ, కలశం ఉంటాయి.

ప్రారంభమైన స్వామివారి దీక్షలు

హనుమాన్ 41 రోజుల మండల దీక్షలు(మాలధారణ) ఆదివారం ఉగాది పర్వదినం నుంచి ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 12 వరకు దీక్షలను స్వీకరిస్తారు. 21 రోజుల అర్ధమండల దీక్షలు ఏప్రిల్ 28 నుంచి మే 2 వరకు, 11 రోజుల ఏకాదశదిన దీక్షలు మే 8 నుంచి 12వ తేదీ వరకు భక్తులు స్వీకరిస్తారు. 22న హనుమాన్ జయంతి(జన్మోత్సవం) కార్యక్రమంతో దీక్షలను విరమిస్తారని ఆలయ ధర్మకర్త శ్రీసీతా ఆనంద్‌సా అండ్ బ్రదర్స్, ప్రధాన అర్చకులు జాగర్లపుడి అయ్యప్పశర్మ తెలిపారు.

వైభవంగా గుండ బ్రహ్మయ్య జాతర

సంగెం: మండలంలోని గవిచర్ల గ్రామంలో గుండ బ్రహ్మయ్య జాతర వైభవంగా జరిగింది. ఆదివారం ఉగాది పండుగను పురస్కరించుకుని ఆలయపూజారి పిల్లలమర్రి కార్తీక్ ఇంటి నుంచి ఊరేగింపుగా ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చి గుడిలో ప్రతిష్ఠించారు. రాత్రిపూట ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, కార్లు, ఆటోలు తదితర వాహనాలతో భక్తులు గుడి చుట్టూ ప్రదక్షిణ చేసి గుండబ్రహ్మయ్యను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు మండలంలోని సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పర్వతగిరి సీఐ రాజగోపాల్, సంగెం, పర్వతగిరి ఎస్సైలు నరేష్, ప్రవీణ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దర్శించుకున్న ప్రముఖులు

గుండబ్రహ్మయ్య జాతర సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తదితరులు దర్శించుకున్నారు. జాతరలో దేవాలయం లోపల ఉన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆప్యాయంగా పలకరించుకున్నారు.



గుండ బ్రహ్మయ్య సన్నిధిలో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, 'కుడా' చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

ఫర్నిచర్ షాపుల్లో భారీ అగ్ని ప్రమాదం


అగ్ని ప్రమాదంలో కాలిన ఫర్నిచర్ సామగ్రి

వరంగల్: వరంగల్ ములుగురోడ్ సమీపాన భద్రకాళీ ఆలయం వైపు వెళ్లే రహదారిలోని నాలుగు ఫర్నిచర్ షాపుల్లో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకున్నట్లు వరంగల్ ఫైర్ ఆఫీసర్(ఎస్ఎఫ్ఓ) రాజేశ్వర్ తెలిపారు. మంజునాథ ఉడ్ వర్క్స్, సాహస్ర ఉడ్ వర్క్స్ ఫర్నిచర్స్, ఉపేంద్ర కార్పెంటర్ వర్క్స్, ముఖేష్ ఉడ్ ఫర్నిచర్స్, నవీన్ ఉడ్ వర్క్స్‌లకు చెందిన షాపుల్లో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగినట్లు బాధితులు తెలిపినట్లు ఎస్ఎఫ్ఓ పేర్కొన్నారు. తెల్లవారుజామున 3 గంటలకు మంటలు చెలరేగడంతో బాధితుల ఫిర్యాదు మేరకు వెళ్లి ఆర్పినట్లు తెలిపారు. కర్రతో చేసిన సామగ్రి కావడంతో అప్పటికే మొత్తం అగ్నికి ఆహుతైనట్లు బాధితులు తెలిపారు. ఈప్రమాదంలో సుమారు రూ.50లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు నాగరాజు, నవీన్ తదితరులు కన్నీరుమున్నీరయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఎఫ్ఓ తెలిపారు.

ఘనంగా జడకొప్పలాట


జడకొప్పలాట ఆడుతున్న యవకులు

నర్మెట: ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం మండల కేంద్రం లోని పోశమ్మ గుడి మర్రిచెట్టు వద్ద జడకొప్పుల ఆట ఘనంగా నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం 30 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ ఆటలో కర్రకు చేసిన 22 రంధ్రాల ద్వారా చెట్టుకు వేలాడదీసిన తాళ్లను యువత కోలాటాల నడుమ జడకొప్పుగా అల్లడం, అదేవిధంగా తిరిగి విడదీయడం విశేషం. గోల్కొండ చంద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలో డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి, దేవులపల్లి భాగ్యలక్ష్మి, పులి కనకయ్య, గడ్డం మల్లేశ్, గొల్కొండ రవి, కొలెపాక స్వామి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

● జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన

వాజేడు: ఫ్లై ఓవర్ పైనుంచి దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన హైదరాబాద్‌లోని జీడిమెట్లలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. బంధువుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని సుందరయ్య కాలనీ గ్రామానికి చెందిన అల్లి రాంబాబు, వరలక్ష్మి దంపతుల మూడో కుమారుడు సాయి ప్రసాద్ (20) భద్రాచలంలోని మదర్ థెరిస్సా డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. 20 రోజుల క్రితం చదువుపై ఆసక్తి లేదని హైదరాబాద్ వెళ్లి ఏదైనా ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటానని తల్లిదండ్రులకు చెప్పాడు. చదువుకుంటే మంచి ఉద్యోగం వస్తుందని తల్లిదండ్రులు చెప్పినా పట్టించుకోకుండా హైదరాబాద్ వెళ్లాడు. రాంబాబు.. కొడుకు సాయిప్రసాద్ ఆచూకీ తెలుసుకుని జీడిమెట్ల వెళ్లి మాట్లాడాడు. ఇంటికి రావాలని బతిమిలాడాడు. అయితే ఇంటికి వస్తానని చెప్పిన సాయిప్రసాద్.. ఆ వెంటనే ఫ్లై ఓవర్ పైనుంచి దూకాడు. ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

రూటు మార్చి.. ఘాటు పెంచి

గంజాయి రవాణాలో స్మగ్లర్ల కొత్త పంథా
- ఏఓబీ నుంచి తెలంగాణ, మహారాష్ట్రకు ఆశీష్ ఆయిల్‌గా మార్చి విక్రయాలు
- లీటర్ గంజాయి ఆయిల్ ధర రూ. 2 లక్షలు
- శీతల పానీయాలు, ఐస్‌క్రీమ్, చాక్లెట్లలో మిక్సింగ్


మహబూబాబాద్‌లో స్మగ్లర్ నుంచి పట్టుకున్న ఆశీష్ ఆయిల్(ఫైల్)

సాక్షి, మహబూబాబాద్ : యువత జీవితాలను నాశనం చేస్తున్న గంజాయి ఇప్పుడు ఆకు, పువ్వు రూపంలోనే కాదు.. లిక్విడ్ రూపంలోనూ లభిస్తోంది. గంజాయి రవాణాపై పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా పెంచిన నేపథ్యంలో స్మగ్లర్లు రూటు మార్చి.. ఘాటు పెంచి.. ఎక్కువ మత్తునిచ్చే గంజాయిని తక్కువ మోతాదుకు కుదించి.. రేటు పెంచి.. సునాయసంగా సరఫరా చేస్తున్నారు. పెద్ద బస్తాలు, ప్యాకెట్లు కాకుండా.. వాటర్ బాటిల్ సైజ్‌లో ఎవరికీ అనుమానం రాకుండా గమ్య స్థానాలకు చేరవేస్తున్నారు. ఇటీవల మహబూబాబాద్‌లో గంజాయి ఆశీష్ ఆయిల్ రవాణా చేస్తూ పట్టుబడిన ఘటనతో రూటు మార్చి గంజాయి స్మగ్లింగ్ విషయాలు బయటపడ్డాయి.

కిలో గంజాయితో వంద మిల్లీ లీటర్ల ఆయిల్..

కిలోల కొద్ది గంజాయి తరలించడం కన్నా.. కుదించి సరఫరా చేయడం సులభమని భావించిన స్మగ్లర్లు ఎంచుకున్న కొత్త పంథా ఆశీష్ ఆయిల్ తయారీ చేసి అమ్మకాలు చేయడం. ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మొదలైన ఈ విధానం ఇతర ప్రాంతాలకు పాకినట్లు తెలుస్తోంది. గంజాయిని ఎక్కువ మోతాదు నీళ్లల్లో గంటల కొద్ది ఉడికించి, అందులో కొన్ని రసాయనాలు కలిపితే ఆశీష్ ఆయిల్ వస్తుంది. కిలో గంజాయికి 100 మిల్లీ లీటర్ల ఆయిల్ తీస్తారు. అంటే పదికిలోలకు ఒక లీటర్, క్వింటా గంజాయిని పది వాటర్ బాటిళ్ల అంటే పది లీటర్ల పరిమాణంలోకి కుదిస్తారు. ఇలా తయారీ చేసిన గంజాయి తైలం లీటర్ రూ.లక్ష నుంచి దూరం వెళ్లే కొద్ది రూ. 2లక్షలు కూడా పలుకుతున్నట్లు సమాచారం. ఏఓబీ(ఆంధ్ర–ఒడిశా బార్డర్) నుంచి భద్రాచలం మీదుగా మహబూబాబాద్, హైదరాబాద్, మహారాష్ట్ర, కొవ్వూరు, సూర్యాపేట నుంచి హైదరాబాద్, కర్ణాటక, నర్సీపట్నం నుంచి వైజాగ్ మొదలైన ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్లు ఇటీవల పట్టుబడిన స్మగ్లర్లు చెబుతున్నారు. తేనె, మిక్స్‌డ్ డ్రైఫ్రూట్స్‌ను పోలి ఉండే ఈ ఆశీష్ ఆయిల్‌ను చిన్న మోతాదుల్లో జిందా తిలిస్మాత్, సెంట్ సీసాల సైజ్‌లో ఉన్న బాటిళ్లలో పోసి గుట్టుచప్పుడు కాకుండా ఆర్డర్లపై సప్లయ్ చేస్తుండడం గమనార్హం.

సులభంగా మిక్సింగ్..

యువత వినియోగించే సిగరెట్లు, తినుబండారాల్లో కలిపేందుకు సాధారణ గంజాయి కన్నా.. ఆశీష్ ఆయిల్ కలపడం సులభంగా ఉంటుంది. ప్రధానంగా కుల్ఫీ, ఐస్‌క్రీమ్, కూల్ డ్రిక్, చాక్లెట్, కేక్, స్వీట్లు మొదలైన తినుబండారాలు, సిగరెట్లు, కట్‌చీప్స్‌పై వేసుకొని పీల్చడం, మొదలైన పద్ధతుల్లో వాడేందుకు అనుకూలంగా ఉంటుంది. అయితే మామూలు గంజాయి కన్నా.. పదిరెట్లు ఈ లిక్విడ్ గంజాయి మత్తెక్కించే గుణం ఉంటుంది. అందుకే సమే సూక్ష్మ పరిమాణంలో కలిపితే సరిపోతుంది.

నాడీ వ్యవస్థ త్వరగా చెడిపోతుంది



మత్తుకు బానిస అవుతున్న యువకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సాధారణ గంజాయి కన్నా.. ఆశీష్ ఆయిల్ పదిరెట్లు ఎక్కువ శక్తివంతమైనది. దీనికి బానిసైతే.. కోలుకోవడం కష్టం. ముందు నాడీ వ్యవస్థ, తర్వాత లివర్, కిడ్నీ, గుండె, జీర్ణవ్యవస్థ దెబ్బతింటుంది. ఈ మత్తులో విచక్షణ కోల్పోయి ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి ఉంటుంది. దీనికి బానిసైనవారు రెండు, మూడు సంవత్సరాల్లో చనిపోయే ప్రమాదం ఉంది.

– డాక్టర్ వీరమల్ల మాధవరావు, ప్రొఫెసర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల, మహబూబాబాద్

నిఘా పెంచి పట్టుకున్నాం



ఛత్తీస్‌గఢ్ సరిహద్దు నుంచి మహబూబాబాద్ మీదుగా హైదరాబాద్, మహారాష్ట్ర ప్రాంతాలకు గంజాయి తరలించే విషయంపై కట్టుదిట్ట నిఘా పెంచాం. అనుమానం వస్తే చాలు.. చెక్ చేసి వందల కిలోల గంజాయి పట్టుకున్నాం. అయితే స్మగ్లర్లు రూటు మార్చారు. ఆశీష్ ఆయిల్‌గా మార్చి విక్రయించే విషయంపై నిఘా పెట్టి పట్టుకున్నాం. తక్కువ పరిమాణంలో ఎక్కువ మత్తు స్మగ్లింగ్ చేసే మార్గం చూసి మేమే ఆశ్చర్యపోయాం.

– సుధీర్ రాంనాథ్ కేకన్, ఎస్పీ, మహబూబాబాద్

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం

- బెట్టింగ్ యాప్‌లను ఉపేక్షించబోం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం: రాష్ట్రంలో మాదక ద్రవ్యాలపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కాటారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూంను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువతను పెడదోవ పట్టిస్తున్న మాదకద్రవ్యాలు, బెట్టింగ్ యాప్‌ల నియంత్రణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల నివారణకు ప్రభుత్వ పరంగానే కాకుండా ప్రజలు కూడా తమ వంతు బాధ్యత పోషించాలన్నారు. బెట్టింగ్ యాప్‌లతో అనేక మంది మోసపోయి ఆత్మహత్యలకు పాల్పడి తమ కుటుంబాలను రోడ్డుపాలు చేస్తున్నారన్నారు. బెట్టింగ్ యాప్‌లతో బలికావొద్దని పోలీస్, ఇతర రాత్రా శాఖల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. మంథని నియోజకవర్గంలోని పోతారంలో ఓ వ్యక్తి బెట్టింగ్ యాప్ బారిన పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు మరో కుటుంబంలో జరగకుండా పూర్తి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాలు, బెట్టింగ్‌యాప్‌లను ఉపేక్షించబోమని, వాటిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీసీ కెమెరాలతో నేరాలు వెంటనే శోధించొచ్చని, మంథనిలో వామన్‌రావు దంపతుల హత్య జరిగినప్పుడు సరైన ఆధారాలు లేకపోవడంతో అనేక మంది నిందితులు తప్పించుకున్నారని చెప్పారు. సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయడంపై ఎస్పీ కిరణ్‌ఖరే, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్‌ను అభినందించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, ఎస్సైలు శ్రీనివాస్, మహేందర్‌కుమార్, నరేశ్, పవన్, తమాషారెడ్డి, రమేశ్, గీతారాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా

● ఆరు ట్రాక్టర్ల సీజ్, కేసు నమోదు


వాగు నుంచి ట్రాక్టర్‌ను నడుపుకుంటూ వస్తున్న తహసీల్దార్

నెల్లికుదురు: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని ఆకేరువాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తూ ఇసుకాసురులు అధికారులకు సవాల్ విసురుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉగాది పండగ రోజున వాగు నుంచి ఇసుక రవాణా అవుతున్నట్లు సమాచారం అందుకున్న తహసీల్దార్ రాజు.. ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీస్, రెవెన్యూ శాఖ ఆధ్వర్యాన సిబ్బందితో రంగంలోకి దిగారు. బ్రాహ్మణకొత్తపల్లి శివారులో ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేయడానికి వెళ్లిన అధికారులను చూసి యజమానులు, డ్రైవర్లు వాగులోనే వాహనాలను వదిలి పారిపోయారు. దీంతో తహసీల్దార్ రాజు స్వయంగా డ్రైవర్ అవతారమెత్తారు. సిబ్బందితో కలిసి వాగు నుంచి ఆరు ట్రాక్టర్లను కార్యాలయానికి తరలించి సీజ్‌చేసి కేసు నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌కు పంపించారు.

కాజీపేట జంక్షన్ మీదుగా 'భారత్ గౌరవ్'

- ఏప్రిల్ 9న ఐఆర్‌సీటీసీ సప్తజ్యోతిర్లింగ దర్శన్ యాత్ర

కాజీపేట రూరల్ : ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల సౌకర్యార్థం కాజీపేట జంక్షన్ మీదుగా భారత్ గౌరవ్ ప్రత్యేక టూరిస్ట్ రైలును ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ మార్కెటింగ్ ఇన్‌చార్జ్ నరేశ్‌బాబు, టూరిజం మానిటర్ కె. ప్రశాంత్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు కాజీపేట రైల్వే వీఐపీ లాంజ్‌లో యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఏప్రిల్ 8వ తేదీ రాత్రి సప్తజ్యోతిర్లింగ దర్శన యాత్ర సికింద్రాబాద్ ఐఆర్‌సీటీసీ ప్రత్యేక టూరిస్ట్ విజయవాడ నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. 9వ తేదీన కాజీపేట, సికింద్రాబాద్, నిజామాబాద్ మీదుగా సాగే ఈ టూరిస్ట్ ట్రైన్ ఏడు జ్యోతిర్లింగ యాత్రలో భాగంగా ఉజ్జయిని మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, ద్వారకా నాగేశ్వర్, సోమనాథ్ భీ మశంకర్, త్రయంబకేశ్వర్, గృశ్నేశ్వర్ దర్శన సందర్శన ఉంటుందని తెలిపారు. యాత్రలో అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, బస, రవాణా, ట్రావెల్ ఇన్సూరెన్స్‌తోపాటు కోచ్‌లో సెక్యూరిటీగార్డు, టూర్ గైడ్ అందుబాటులో ఉంటారని తెలిపారు. టికెట్ ధర ఒకరికి రూ.20,980 ఉంటుందని తెలిపారు. దర్శన్ టూర్‌కు సంబంధించిన వివరాలకు 9701360701, 92810 30711 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

కాజీపేట మీదుగా వేసవి ప్రత్యేక రైళ్లు

- చర్లపల్లి–హజ్రత్‌నిజాముద్దీన్ మధ్య 13 సర్వీస్‌లు

కాజీపేట రూరల్ : వేసవిలో ప్రయాణికుల సౌకర్యార్థం కాజీపేట జంక్షన్ మీదుగా ఏప్రిల్ 6వ తేదీ నుంచి చర్లపల్లి–హజ్రత్ నిజాముద్దీన్ మధ్య 13 రైళ్ల సర్వీస్‌లను నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ ఆదివారం తెలిపారు.

వేసవి ప్రత్యేక రైళ్ల సర్వీస్ వివరాలు..

చర్లపల్లి నుంచి ఏప్రిల్ 6వ తేదీ నుంచి జూన్ 29వ తేదీ వరకు ప్రతీ ఆదివారం చర్లపల్లి–హజ్రత్‌నిజాముద్దీన్ (07023) ఎక్స్‌ప్రెస్ కాజీపేట జంక్షన్‌కు చేరుకుని వెళ్తుంది. అదేవిధంగా హజ్రత్‌నిజాముద్దీన్‌లో ఏప్రిల్ 8వ తేదీ నుంచి జూలై 1వ తేదీ వరకు ప్రతీ మంగళవారం హజ్రత్‌నిజాముద్దీన్–చర్లపల్లి (07024) ఎక్స్‌ప్రెస్ బుధవారం కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుందని తెలిపారు. 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ కోచ్‌లతో ప్రయాణించే ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీస్‌లకు అప్ అండ్ డౌన్ రూట్‌లో కాజీపేట, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్హార్షా, నాగ్‌పూర్, ఇటార్సీ, భోపాల్, బీనా, ఝాన్సీ, గ్వాలియర్, ఆగ్రా స్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.

దండెంపై దుస్తులు ఆరేస్తుండగా..

- విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి
- మాధవనగర్‌లో ఘటన


సాంబయ్య మృతదేహం

నర్సంపేట: దండెంపై దుస్తులు ఆరేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి ఒకరు మృతి చెందాడు. ఈ ఘటన చెన్నారావుపేట మండలం ఎల్లాయిగూడెం గ్రామ శివారు మాధవనగర్ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం ... గ్రామానికి చెందిన అర్కాల సాంబయ్య(39) జల్లి గ్రామంలోని రైస్‌మిల్లులో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం స్నానం చేసి దండెంపై దుస్తులు ఆరేస్తుండగా ఆ తీగకు విద్యుత్ సరఫరా అయి షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబీకులు చికిత్స నిమిత్తం 108లో నర్సంపేటకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య భవాని, కుమారుడు అభిలాశ్, కూతురు శ్యామల ఉన్నారు. సాంబయ్య మృతితో కుటుంబంతోపాటు కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నారావుపేట ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

ఏషియన్ పారా త్రోబాల్ పోటీల్లో కృష్ణవేణి ప్రతిభ

స్టేషన్‌ఘన్‌పూర్: ఏషియన్ పారా త్రోబాల్ చాంపియన్ షిప్ పోటీల్లో స్టేషన్‌ఘన్‌పూర్ మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన మాచర్ల కృష్ణవేణి ప్రతిభ చాటింది. ఈనెల 28 నుంచి 30వ తేదీవరకు కాంబోడియా రాజధాని పీనంపెన్‌లో జరిగిన మొదటి ఏషియన్ పారాత్రోబాల్ పోటీల్లో ఇండియా తరఫున ప్రాతినిధ్యం వహించింది. ఈ పోటీల్లో మొత్తం 8 దేశాలు పాల్గొనగా.. ఇండియా కాంస్య పతకం సాధించింది. భారత జట్టులో కృష్ణవేణి ప్రతిభ చాటింది. కాగా, గత డిసెంబర్ 4,5,6వ తేదీల్లో కాంబోడియాలో జరిగిన సిట్టింగ్ పారాత్రోబాల్ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న కృష్ణవేణి అత్యుత్తమ ప్రతిభతో గోల్డ్‌మెడల్ సాధించింది. ప్రస్తుతం జరిగిన మొదటి ఏషియన్ పారాత్రోబాల్ చాంపియన్ షిప్ పోటీల్లోనూ ప్రతిభ చాటడంతో ఇండియా జట్టు కాంస్య పతకం సాధించింది. ప్రపంచ పారాత్రోబాల్ క్రీడల అధ్యక్షుడు వీయాన్‌సన్ చేతుల మీదుగా పతకం అందుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏషియన్ పారాత్రోబాల్ పోటీల్లో ప్రతిభ చూపడం సంతోషంగా ఉందని, సహకరించిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాభిమానులు, ప్రజాప్రతినిధులు కృష్ణవేణికి అభినందనలు తెలిపారు.


కాంస్య పతకంతో మాచర్ల కృష్ణవేణి

లక్ష్య సాధకులు..

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ కొలువు సాధించాలంటే ఆషామాషీ కాదు. వందల్లో పోస్టులు.. లక్షల్లో అభ్యర్థులు. ఒక్క పోస్టుకు వేలాది మంది పోటీపడుతున్న ఈ రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే కఠోర తపస్సు చేయాల్సిందే. నిరంతరం ప్రణాళిక ప్రకారం పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిందే. దోస్తీ కట్టాల్సిందే. అప్పుడే విజయం వరిస్తుంది. సరిగ్గా ఇదే సూత్రాన్ని పాటించిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు గ్రూప్–1లో మెరిశారు. ఒకపక్క ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. మరో పక్క ప్రణాళిక ప్రకారం సన్నద్ధమయ్యాయి. ఈ సమయంలో ఎన్నో అవాంతారాలు.. మరెన్నో అడ్డంకులు ఎదురైనా మొక్కవోని దీక్షతో చదివి ఫలితాల్లో లక్ష్యం చేరుకుని తమ కలలను నెరవేర్చుకున్నారు. ఆదివారం ప్రభుత్వం గ్రూప్–1 ర్యాంకులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో వీరి విజయగాథపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

మెరిసిన సీడీపీఓ అజ్మి



గూడూరు: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) గూడూరు ప్రాజెక్టు అధికారి, సీడీపీఓ నీలోఫర్ అజ్మి గ్రూప్ –1 ఫలితాల్లో మెరిసింది. సీడీపీఓగా గెజిటెడ్ హోదాలో విధులు నిర్వర్తిస్తూ గ్రూప్ –1 రాశారు. ఇందులో రాష్ట్రస్థాయిలో 136 వర్యాంకు, మల్టీజోన్‌లో 70 ర్యాంకు సాధించారు.

నాన్న ఆశయం నెరవేరింది



చిట్యాల: మాది జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గుంటూరుపల్లి గ్రామం. మా తల్లిదండ్రుల పేరు వెల్ది నాగేశ్వర్‌రావు, విజయలక్ష్మి. మేము అన్నదమ్ముం. నేను మొదటి సంతానం.ఏడు నెలల క్రితం మా నాన్న మృతి చెందాడు. ఈ క్రమంలో గ్రూప్–1 పరీక్షకు 45 రోజుల సమయం మాత్రమే ఉండడంతో దుఃఖం దిగమింగుకుంటూ నాన్న ఆశయం మేరకు కష్టపడి చదివి పరీక్ష రాశా. మొదటి ప్రయత్నంలోనే 70వ (హాల్‌టికెట్ నంబర్ 240927457)ర్యాంకు సాధించా. ఈ విజయం నాకు ఎంతో ఆనందం ఇస్తోంది.

–వెల్ది గోపికృష్ణ, 70వ ర్యాంకర్

కష్టపడి పని చేస్తే సాధించలేనిది ఏమి లేదు



బచ్చన్నపేట : కష్టపడి పని చేస్తే సాధించలేనిది ఏమి ఉండదు. నిరంతరం లక్ష్యం వైపే వెళ్తే ఎలాంటి పేదరికానైనా చదువుతో జయించొచ్చు. మాది బచ్చన్నపేట మండల కేంద్రం. మా తల్లిదండ్రులు చిమ్ముల అరుణ, మల్లారెడ్డి వ్యవసాయం చేస్తూ నన్ను చదివించారు. నేను గ్రూప్–1లో 467 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 272వ ర్యాంకు , జోనల్ స్థాయిలో 13వ (హాల్‌టికెట్ నంబర్ 240944589) ర్యాంకు సాధించా. గ్రూప్–2లో రాష్ట్ర స్థాయి 8వ ర్యాంకు సాధించా.

చిమ్ముల రాజశేఖర్‌రెడ్డి, 272వ ర్యాంకర్

డీఎస్పీ కావాలనే కోరిక నెరవేరబోతున్నది



కేయూ క్యాంపస్: డీఎస్పీ కావాలనే నా కోరిక నెరవేరబోతున్నది. గ్రూప్ –1లో 505 మార్కులు సాధించి 36వ (హాల్‌టికెట్ నంబర్240912308)ర్యాంకు సాధించా. మాది ఉమ్మడివరంగల్ జిల్లాలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండలం సుల్తాన్‌పూర్ గ్రామం. మా తల్లిదండ్రులు బి. మొగిళి, జ్యోతి. మా తండ్రి పరకాల పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం నేను కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నా. కాగా, మాధవ్‌కు భార్య సుష్మ, తల్లిదండ్రులు బి. మొగిళి, జ్యోతి, గ్రామస్తులు, బంధువులు శుభాకాంక్షలు తెలిపారు.

–బి. మాధవ్, 36వ ర్యాంకర్

ఉదయ్‌కుమార్ ప్రతిభ..



రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ఉదయ్‌కుమార్ గ్రూప్–1లో 463 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 332(హాల్‌టికెట్ నంబర్ 240907355) ర్యాంకు సాధించాడు. కొయ్యడ ప్రభాకర్, లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు ఉదయ్‌కుమార్ గతేడాది డిసెంబర్‌లో సింగరేణిలో పర్సనల్ మేనేజర్‌గా ఉద్యోగం సాధించి నాలుగు నెలలుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ప్రకటించిన గ్రూప్–1లో ప్రతిభ చాటడంపై తల్లిదండ్రులతో పాటు స్నేహితులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

జశ్వంత్‌రాజ్ విజయం



మహబూబాబాద్ అర్బన్: గ్రూప్–1లో జిల్లా కేంద్రానికి చెందిన సంగాల రవికుమార్ –ప్రసన్న దంపతుల కుమారుడు జశ్వంత్‌రాజ్ 900 మార్కులకు 465 సాధించి రాష్ట్రస్థాయిలో 323 ర్యాంకు, మల్టీజోన్ –1లో 139 (హాల్‌టికెట్ నంబర్ 240909440) ర్యాంకు సాధించాడు. దీనిపై తల్లిదండ్రులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

గుడెల్లి విష్ణు ప్రతిభ



మహబూబబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన గుడెల్లి విష్ణు.. గ్రూప్ –1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 791వ ర్యాంకు, మల్టీజోన్‌లో 33వ (హాల్‌టికెట్ నంబర్ 240919020) ర్యాంకు సాధించారు. 900 మార్కులకు 442.5 మార్కులు సాధించారు. కాగా, విష్ణును భార్య స్వప్న, తల్లిదండ్రులు ముత్యాయ, లక్ష్మి ,అన్న శంకర్, అక్క కళ అభినందించారు. కాగా, విష్ణు కురవి మండలం మొదులగూడె ప్రభుత్వ పాఠశాలో బయోసైన్స్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

పవన్‌కల్యాణ్‌కు 24వ ర్యాంకు



గార్ల: గార్ల మండలం పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన గంగావత్ పవన్‌కల్యాణ్ గ్రూప్–1 ఫలితాల్లో ఎస్టీ విభాగంలో 24వ ర్యాంకు సాధించాడు. రాష్ట్రస్థాయిలో 454 మార్కులు సాధించి 527 (హాల్‌టికెట్ నంబర్ 240906070) ర్యాంకు కైవసం చేసుకున్నాడు. సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా 'సాక్షి'తో పేర్కొన్నాడు. కోచింగ్ లేకుండానే గ్రూప్–1లో 454 మార్కులు సాధించినట్లు వెల్లడించారు.

పండుగ పూట విషాదం

- చెట్టును ఢీకొన్న బైక్..
- ఇద్దరు యువకుల మృతి
- చిన్నపెండ్యాలలో ఘటన


దిలీప్ మృతదేహం


క్రాంతికుమార్ మృతదేహం

చిల్పూరు: పండగ పూట విషాదం నెలకొంది. బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని చిన్నపెండ్యాలలో జరిగింది. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన ఎర్ర దిలీప్(25) ఆదివారం సాయంత్రం స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉంటున్న మిత్రుడు చింత క్రాంతికుమార్(24) వద్దకు వచ్చాడు. పని ఉందని తన ద్విచక్ర వాహనంపై తాటికాయల గ్రామానికి వెళ్లారు. తిరిగి రాత్రి వస్తుండగా చిన్నపెండ్యాల సమీపంలోని మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి చెటును ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎస్సై నవీన్‌కుమార్ ఘటనాస్థలికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, ఈ ఘటనతో పండగా పూట రెండు కుటుంబాలు, గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఛాగల్లులో వృద్ధుడు..


మారయ్య (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి ఛాగల్లు గ్రామంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భాస్కుల మారయ్య((61) మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఛాగల్లుకు చెందిన మారయ్య తన వ్యక్తిగత పనులపై రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపునకు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మారయ్య తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈ ఘటనలో కారు డ్రైవర్ శ్రావణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

చెరువులో మునిగి యువకుడి మృతి

● గణపురం మండల కేంద్రంలో ఘటన


విజయ్ మృతదేహం

గణపురం : ఉగాది పండుగ వేళ విషాదం చోటు చేసుకుంది. చెరువులో మునిగి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. మండంలోని చెల్పూర్‌కు చెందిన ఎల్దండి విజయ్ (26) స్నేహితులతో కలిసి మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువులో స్నానానికి వెళ్లాడు. ఈ క్రమంలో విజయ్ చిన్న మత్తడిలో కాలుజారి నీట ముని మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై రేఖ అశోక్ ఘటనా స్థలికి చేరుకుని స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లి జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతుడు విజయ్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసింది.